బోదెలో పడి ఇద్దరు బాలలు మృతి

ధర్మారావుపేటలో ఘటన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని సరిపల్లి శివారు ధర్మారావుపేట గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. బహిర్భుమికి వెళ్లిన ఇద్దరు బాలలు సుమారు 15.20 అడుగుల లోతు ఉన్న బోదెలో పడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సరిపల్లి గ్రామానికి చెందిన ఇమ్మానులు మనవరాలి పుట్టినరోజు వేడుకకు ఆదివారం ఉదయం ధర్మారావుపేటకు చెందిన అద్దేపల్లి లాజరు కుమారుడు చందు (17), తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాళ్లపూడి గ్రామానికి చెందిన కొట్టా రాజేంద్రబాబు కుమారుడు గగన్ సందేశ్ (12) వచ్చారు. ఈ క్రమంలో వీరిద్దరు ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో బహిర్భుమికి వెళ్లగా ప్రమాదవశాత్తూ సరిపల్లి ఏరియాలో కోమటికుంట చెరువు వద్ద సుమారు 15.20 అడుగుల లోతు ఉన్న బోదెలో పడి మృతి చెందారు.

మహిళా ఓటర్లకు..

చీర 'ఎర'..!

ఎన్నికల్లో గెలిచేందుకు ఈసారి ముందుగానే గాలం

షెడ్యూల్ కూడా రాక ముందే తాయిలాల పంపిణీ

డ్వాక్రా మహిళలకు చీరలు అందజేత

పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో తాయిలాల జోరు

మిగిలిన నియోజకవర్గాల్లోనూ తాయిలాల వ్యూహాలకు పదును

పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడకుండానే ఓటర్లను వలలో వేసుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంఎల్ఎ అభ్యర్థులు ఇప్పటి నుంచే తాయిలాల పంపిణీకి తెరలేపారు. ముఖ్యంగా మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ ప్రారంభించారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎంఎల్ఎ అభ్యర్థులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. మరో నెలరోజులకుగాని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఇంకా ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. ఇరుపార్టీల్లో తమకు సీటు గ్యారెంటీ అనుకున్న అభ్యర్థులు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించడమే కాకుండా, తాయిలాల పంపిణీకి సైతం తెరలేపిన పరిస్థితి ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ పూర్తయినట్లు తెలిసింది. పాలకొల్లులో వైసిపి, టిడిపి అభ్యర్థులు ఇద్దరూ పోటాపోటీగా డ్వాక్రా మహిళాలకు చీరలు అందించినట్లు తెలుస్తోంది. ఆచంట నియోజకవర్గంలో మాత్రం వైసిపి అభ్యర్థి ఇప్పటికే చీరలు పంపిణీ పూర్తి చేసినట్లు సమాచారం. ఆసరా చెక్కుల పంపిణీ సందర్భంగా అధికార పార్టీ అభ్యర్థులు డ్వాక్రా మహిళలను సమావేశాలకు పిలిచి భోజనాలు పెట్టి, చీరలు అందజేసినట్లు చెబుతున్నారు. ఉండి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంఎల్ఎ ప్రతి ఓటరుకూ కంచం పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అధికారుల నిఘా పెరుగుతుందని, తాయిలాల పంపిణీకి ఇబ్బంది వస్తుందనే కారణంతో అధికార పార్టీ అభ్యర్థులు ముందుగానే అధికార యంత్రాంగం అండతోనే చీరల పంపిణీ సాగించేస్తున్నారు. దీంతో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు కూడా అదేబాటలో నడుస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇంతకుముందు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత, ఎన్నికలకు 48 గంటల ముందు అభ్యర్థులు తాయిలాల పంపిణీ చేపట్టేవారు. ఈసారి ముందుగానే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు చీరల పంపిణీ చేపట్టడం చూస్తే ఈ ఎన్నికలు ఏవిధంగా జరుగుతాయోననే చర్చ నడుస్తోంది.

ఎన్నికల ముందు రోజు పరిస్థితి వేరట..!

ప్రస్తుతం చీరల పంపిణీతో సరిపెడుతున్నామని, ఎన్నికల ముందు పరిస్థితి వేరుగా ఉంటుందని ఇరు పార్టీలకు చెందిన నాయకుల్లో చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లోనూ ఓటుకు రూ.500 నుంచి రూ.రెండు వేల వరకూ పంపిణీ సాగింది. ఈసారి అంతకంటే ఎక్కువగా డబ్బు కుమ్మరించనున్నట్లు చెబుతున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లూ చేసేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వస్తే పోలీసులు, అధికారుల నిఘా పెరిగిపోతుందని, అధికారులంతా ఎన్నికల కమిషన్ చెప్పినట్లు నడుచుకుంటారని అంచనా వేస్తున్నారు. ఇప్పుడైతే అధికారులు తాము చెప్పినట్లు వింటారని అధికార పార్టీ అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంత ఖర్చు పెట్టాలి, ఏవిధంగా పంపిణీ చేయాలనే వ్యూహాలు ఇప్పటికే సిద్ధం చేసుకుని అధికార పార్టీ నాయకులు రెడీగా ఉన్నట్లు సమాచారం. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల జాబితాను ఇంకా ప్రకటించకపోవడంతో ముందుకు, వెనక్కి ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో డబ్బు పెద్దఎత్తున కుమ్మరించి గెలుపు దక్కించుకోవాలని ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎంఎల్ఎ అభ్యర్థులు పంపిణీ చేస్తున్న తాయిలాలపై అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందుముందు పరిస్థితి ఏవిధంగా ఉంటుందో వేచిచూడాలి.

నేడు విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల చలో విజయవాడ

వెళ్లొద్దంటూ సిఐటియు నేతలకు నోటీసులు

తొలుత కార్యాలయంలో, ఆపై ఇంటి వద్ద

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నిర్బంధం

గృహ నిర్బధంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, డైరెక్ట్ పేమెంట్ విధానం అమలు చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్లను సంస్థలో విలీనం చేయాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా జరుగుతుందనే పేరుతో ధర్నాకు వెళ్లొద్దని ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్‌కు టూటౌన్, త్రీటౌన్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. నిడమర్రులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రమణరావుకు పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. డిఎన్‌విడి.ప్రసాద్‌ను సిఐటియు జిల్లా కార్యాలయంలోనే నిర్బంధించారు. అక్కడి నుంచి ఇంటి చేరుకున్న ప్రసాద్‌ను బయటకు వెళ్లకుండా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా, నియంతృత్వం రాజ్యమేలుతుందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయకుండా మాట తప్పడం అన్యాయమన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లను తక్షణమే సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలకు తెగించి పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విధి నిర్వహణలో అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయేది విద్యుత్ సంస్థల్లో మాత్రమేనని, ఇన్ని త్యాగాలు చేస్తున్న విద్యుత్ కార్మికుల పట్ల ముఖ్యమంత్రి చిన్నచూపు చూడటం అన్యాయమన్నారు. తక్షణమే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బిసిలకు పెద్దపీట వేసిన ఘనత జగన్‌దే

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - ఏలూరు

బిసిలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక 32వ డివిజన్‌లో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన యాదవ సంక్షేమ కమ్యూనిటీ హాలును ఆదివారం మంత్రి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్ఎలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు సమున్నత స్థానం కల్పించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. సంక్షేమం-అభివృద్ధికి సమాన ప్రాధాన్యతను ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి నడిపిస్తున్నారని, ప్రభుత్వం చేపట్టిన పథకాలతో రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుండి 6 శాతానికి తగ్గిందని అన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యతిచ్చి నాడు-నేడు కార్యక్రమం ద్వారా విద్య, వైద్యరంగాల్లో పలు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేస్తున్నారన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రైతుల నుండి నేరుగా కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ యాదవ సంక్షేమ కమ్యూనిటీ హాలులో మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.15 లక్షలు, ఏలూరులో త్వరలో నిర్మించబోయే బిసిల సమీకృత కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.25 లక్షలు ఎంపీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏలూరు, దెందులూరు ఎంఎల్ఎలు ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ జగన్ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు బిసిలను ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేసి, వారి సంక్షేమాన్ని గాలికొదిలేశాయన్నారు. ఈ సందర్భంగా ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నెరుసు చిరంజీవి యాదవ సంక్షేమ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.లక్ష, కైకలూరుకు చెందిన శ్రీనివాస్ యాదవ్ లక్షా ఒక వెయ్యి నూట పదహారు రూపాయలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎం ఆర్.పెదబాబు, రాష్ట్ర సాహిత్య మండలి ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, టిటిడి బోర్డు సభ్యులు నెరుసు నాగసత్యం యాదవ్, కారుమూరి సునీల్ యాదవ్, పలువురు యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వెనుక జిల్లా పశువైద్యశాల ప్రాంగణంలో నిర్మించిన జిల్లా గొర్రెల పెంపకందారులు సహకార యూనియన్ భవనాన్ని ఆదివారం మంత్రి నాగేశ్వరరావు రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ ఛైర్మన్ జి.ప్రకాష్‌యాదవ్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మినారాయణ, నేతలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపిఎస్ఆర్‌టిసి ఆధ్వర్యాన రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా ఆర్‌టిసిలో ప్రమాదాల నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు, బస్సుల ఫిట్‌నెస్ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, ఆర్‌టిసి సిబ్బందికే కాకుండా ప్రజల్లో అవగాహన కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు, సంక్రాంతి సందర్భంగా ఆర్‌టిసికి ఆదాయం ఎలా ఉంది వంటి ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: ఆర్‌టిసి భద్రతా మాసోత్సవాలు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు జరుగుతున్నాయి? దీని ఉద్దేశం ఏమిటి?

ఆర్‌టిసి భద్రతా మాసోత్సవాలు జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరుగుతున్నాయి. గతంలో వారోత్సవాలు, ఆ తర్వాత పక్షోత్సవాలు జరిగేవి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రవాణా రంగంతో సంబంధం ఉన్న అన్ని శాఖలు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయి. దీని ముఖ్యోద్దేశం ప్రమాదాలు నివారించటం, ప్రమాదాలపై అవగాహన కల్పించడం, గతంలో జరిగిన ప్రమాదాలపై సమీక్షించుకోవడం, విశ్లేషించుకోవడం.

ప్రశ్న: ప్రమాదాల నివారణకు ఇలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఆర్‌టిసిలో ప్రమాదాల నివారణకు ముఖ్యంగా డ్రైవర్లకు అవగాహన కల్పించడం, శిక్షణ ఇవ్వటం, గతంలో జరిగిన ప్రమాదాలపై సమీక్షించి అవి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు డ్రైవర్లకు వివరించడం వంటివి చేస్తున్నాం.

ప్రశ్న: గతంలో ప్రమాదాలు చేసిన వారికి ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు? అలాగే ప్రమాద రహిత డ్రైవర్లకు ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు?

గతంలో ఎక్కువగా ప్రమాదాలు చేసిన డ్రైవర్లను గుర్తించి వారికి శిక్షణతోపాటు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వారి కుటుంబానికి కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. అలాగే ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తున్నాం. అలాగే ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించి డిపోస్థాయిలో ముగ్గురికి, జిల్లాస్థాయిలో ముగ్గురికి నగదు బహుమతులు అందజేస్తున్నాం.

ప్రశ్న: ప్రమాదాలు ఎక్కువగా జరిగే రూట్‌లను ఏమైనా గుర్తించారా? కారణాలు కూడా గుర్తించారా? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తరచూ ప్రమాదాలు జరిగే రూట్‌లను గుర్తించి మ్యాపింగ్ చేసి డ్రైవర్లకు అందించడం జరుగుతుంది. ఎక్కడెక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి, ఆ ప్రాంతంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడెక్కడ ఇరుకైన కల్వర్టులు ఉన్నాయి అనేది గుర్తించి డ్రైవర్‌కు కార్డు రూపంలో ఇస్తున్నాం. ప్రతి డ్రైవర్‌కు డ్యూటీ ఎక్కేముందు ఆల్కహాల్ టెస్ట్ చేయడం జరుగుతుంది. అలాగే 45 సంవత్సరాలు దాటిన వారికి సంవత్సరానికి ఒకసారి, 45 సంవత్సరాల్లోపు వారికి మూడు సంవత్సరాలకు ఒకసారి పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నాం.



ప్రశ్న: ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహనా ర్యాలీలు నిర్వహించడం, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం వంటివి చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని బస్సులు ఉన్నాయి, డ్రైవర్లు, కండక్టర్లు ఎంతమంది ఉన్నారు, సరిపడా సిబ్బంది ఉన్నారా?

జిల్లాలో మొత్తం అద్దె బస్సులతో కలిపి 292 బస్సులు ఉండగా, 700 మంది వరకు డ్రైవర్లు, 700 మంది వరకు కండక్టర్లు ఉన్నారు. సిబ్బంది కొరత ఏమీ లేదు.

ప్రశ్న: గత సంవత్సరంతో పోలిస్తే ప్రమాదాల సంఖ్య ఎలా ఉంది? తగ్గాయా, పెరిగాయా?

గత సంవత్సరం 12 మంది ఆర్‌టిసి బస్సు ప్రమాదాల వల్ల మృతి చెందారు. ఈ సంవత్సరం జనవరి వరకు పది మంది మృతి చెందారు. ప్రతి లక్ష కిలోమీటర్లకు ప్రమాదాల రేటు 0.09 శాతంగా ఉంది.

ప్రశ్న: ఈ నెలలో తెలంగాణలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేడారం జాతర ఉన్న సందర్భంగా ఏలూరు జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు ఏమైనా నడుపుతున్నారా?

మేడారం జాతరకు ఈ నెల 21 నుంచి 25వ తేదీల మధ్యలో నూజివీడు నుంచి, జంగారెడ్డిగూడెం నుంచి ప్రత్యేక బస్సులు నడపడానికి నిర్ణయం తీసుకున్నాం. అలాగే ప్రతి శనివారం వాడపల్లికి, ప్రతి పౌర్ణమికి అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ఫిబ్రవరి 18న అంతర్వేది ఉత్సవాల సందర్భంగా, మార్చిలో శివరాత్రి సందర్భంగా బలివే, పట్టిసీమలకు ప్రత్యేక బస్సులు నడపబోతున్నాం.

ప్రశ్న: జిల్లాలో కార్గో సర్వీస్ ఎలా ఉంది? డోర్ డెలివరీ కొనసాగిస్తున్నారా?

జిల్లాలో కార్గో సర్వీస్ బాగా నడుస్తుంది. దీనిద్వారా రోజుకు రూ.లక్షా 50 వేలు ఆదాయం వస్తుంది. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలతోపాటు ఏలూరు పాత బస్టాండ్, కొయ్యలగూడెం, కామవరపుకోట, చింతలపూడి, కైకలూరు, ముదినేపల్లి ప్రాంతాల నుంచి కార్గో సర్వీసులు బుక్ చేస్తున్నాం. 10 కిలోమీటర్లలోపు ఉన్నవారికి డోర్ డెలివరీ చేస్తున్నాం.

ప్రశ్న: చివరిగా ప్రజలకు మీరిచ్చే సలహా, సూచనలు?

ఆర్‌టిసిని ఆదరించి ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించడం వల్ల ఆటోలు, కార్లతో పోలిస్తే ప్రజలకు తక్కువ ఛార్జీలతో ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం లభిస్తుంది. అంతేకాక ఆర్‌టిసి ప్రయాణం సురక్షితం కూడా. కాబట్టి ప్రజలు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించి సురక్షితమైన ప్రయాణ అనుభవం పొందడమేకాక ఆర్‌టిసి అభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

మట్టి లారీలు.. రహదారులు ఛిద్రం

గ్రీన్ ఫీల్డ్ హైవే పనులతో స్థానిక రోడ్లు అధ్వానం

గోతులు, దుమ్ము, ధూళితో వాహనదారుల అవస్థలు

మట్టిరోడ్డుగా మారిపోయిన తారురోడ్డు



గోతులు పడి ఛిద్రమైన ఆర్‌అండ్‌బి రోడ్డు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు అన్న చందంగా తయారైంది గ్రీన్ ఫీల్డ్ హైవే వెంబడి రోడ్ల పరిస్థితి. హైవే నిర్మాణం పేరుతో స్థానిక రోడ్లు ఛిద్రం చేస్తున్నారు. అధిక లోడుతో మట్టి తరలిస్తుండగా ఏకధాటిగా మట్టి లారీలు తిరగడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. అక్కడక్కడా గోతులు సైతం ఏర్పడడంతో ఆ గోతుల్లో మట్టి పోసి మరి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో లారీలు తిరుగుతున్నప్పుడు దుమ్ము లేచి వాహనదారుల కళ్లల్లో పడుతుందని వాపోతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించాలంటే దుమ్ముతో నానా అవస్థలు పడుతున్నామని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. హైవే నిర్మాణం కోసం స్థానిక రోడ్లు ధ్వంసం చేస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పాడైన రోడ్లు వెంటనే అబివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలో కొన్ని నెలలుగా సాగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు స్థానికులకు పెద్ద సమస్యగా మారాయి. చింతలపూడి మండలం రేచర్ల మీదుగా మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం తదితర గ్రామాల మీదుగా జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం వైపు నిర్మితమవుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో హైవే నిర్మాణానికి కావాల్సిన మట్టిని కాంట్రాక్టర్లు జెసిబిలతో తవ్వి లారీలపై తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టి మక్కినవారిగూడెం-టి.నరసాపురం ఆర్‌అండ్‌బి రోడ్డు ద్వారా గ్రీన్ ఫీల్డ్ హైవేకు లారీలపై తరలిస్తున్నారు. అయితే మట్టి లోడుతో లారీలు ఏకధాటిగా రాత్రి పగలు తేడా లేకుండా తిరుగుతుండడంతో ఆ మార్గంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు పాడవడమే కాకుండా అక్కడక్కడా గోతులు కూడా ఏర్పడ్డాయి. దీంతో కాంట్రాక్టర్లు వారి లారీల సౌకర్యం కోసం మట్టి పోసి గుంతలు పూడ్చి తారు రోడ్డును కాస్తా మట్టి రోడ్డుగా మార్చేశారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు.

మట్టిరోడ్డుగా మారిన తారురోడ్డు

వాహనదారుల కళ్లల్లో దుమ్ము, ధూళి

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి మట్టి తోలుతున్న లారీల వల్ల నానా అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ వెంబడి లారీ మట్టితో రోడ్డుపై తిరగడం వల్ల విపరీతమైన దుమ్ము, ధూళి లేచి కళ్లళ్లో పడుతుందని, దారి కనబడడం లేదని, ఒంటినిండా దుబ్బ పట్టి బట్టలు సైతం పాడవుతున్నాయని, కొన్ని సార్లు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి కూడా చోటు చేసుకుంటుందని టి.నరసాపురానికి చెందిన కూరపాటి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల వల్ల ఇటీవల ప్రమాదానికి గురై వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన కూడా చోటు చేసుకుందని వాపోయారు. అధికారులు స్పందించి వాహనదారులకు అవస్థలు లేకుండా చూడాలని, దుమ్ము, ధూళి రాకుండా చూడాలని, ధ్వంసమైన రోడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆటల పోటీల్లో చిన్నారులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

స్పోర్ట్స్‌మీట్ ప్రారంభంలో ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ వెంకటప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యతో పాటు ఆటలపై కూడా విద్యార్థులు మక్కువ చూపాలని ఆంధ్ర హాస్పిటల్స్ వైద్యులు ఎం.వెంకట ప్రసాద్ సూచించారు. స్థానిక వినాయక నగర్‌లోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూలులో స్పోర్ట్స్ మీట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గెలుపు, ఓటములు ప్రామాణికమని చెప్పారు.

బహుమతులు అందిస్తున్న డాక్టర్ వెంకటప్రసాద్

విద్యార్థులు స్నేహపూరిత వాతావరణంలో ఈ స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొనాలన్నారు. స్పోర్ట్స్‌మీట్‌లో ఏలూరు బ్రాంచెస్ రెండు, తణుకు ఒకటి, తాడేపల్లిగూడెం ఒకటి, కైకలూరు ఒకటి మొత్తం ఐదు బ్రాంచులకు సంబంధించిన విద్యార్థులకు 65 మీటర్ల రన్నింగ్ రేస్, జిగ్ జాగ్ ర్యాలి, బాల్ త్రో వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డాక్టర్ వెంకటప్రసాద్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ జి.కోటేశ్వరరావు, వెస్ట్ జోన్ జెడ్‌సిఇ విశాలాక్షి, జెడ్ఇఒ ఎ.శ్రీమన్నారాయణరెడ్డి , ఛాంప్స్ హెచ్ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

ఎపి జెఏసి ఉద్యమ శంఖారావం పిలుపునకు పూర్తి మద్దతు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి జెఏసి ఉద్యమ శంఖారావం పిలుపునకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మద్దతు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రధానంగా సరెండర్ లీవ్స్, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్స్, మెడికల్ బిల్స్, పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవ్స్ అంశాలపై సమావేశంలో మాట్లాడినట్లు తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలని, జల వనరుల శాఖలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ లస్కర్లకు ఎపిసిఒఎస్ ద్వారా 12 నెలలకు జీతాలు ఇప్పించాలని, డిఎ ఎరియర్స్, 11వ పిఆర్‌సిలో ఇవ్వాల్సిన ఎరియర్స్‌ను ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న వైష్ణవి

వైష్ణవికి విశ్వగురు కామధేను అవార్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హైదరాబాదులో ఏర్పాటైన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్ ఇచ్చే కామధేను అవార్డులు ఆదివారం ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్ కుమార్తె అంబుల వైష్ణవి అందుకుంది. ఆదివారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు జడ్జి ఇవివి.వేణుగోపాల్ చేతుల మీదుగా వైష్ణవి కామధేను అవార్డు అందుకున్నారు. 2024 సంవత్సరానికి సంబంధించి ఈ అవార్డుకు వైష్ణవిని ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, సిఇఒ సత్యవోలు రాంబాబు ఎంపిక చేశారు. వైష్ణవి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సేవ సంస్థ కామధేను అవార్డుకు వైష్ణవిని ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో ఐఎఎస్ మాజీ అధికారి లక్ష్మీకాంతం, డాక్టర్ ఎంఆర్ఎస్.రాజు, పి.మదన్‌మోహన్, ప్రతిభ పాల్గొన్నారు.


మినుము పైరు పరిశీలిస్తున్న టిడిపి నేతలు

తాగు, సాగు నీరు అందించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ప్రజలకు తాగునీరు లేక, రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని పెనుమల్లిలో మినుము పైరు వేసుకున్న రైతులు సాగు నీరు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నియోజకవర్గంలో తక్షణమే ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగునీరు అందక ఎండిపోయిన మినుము పైరును టిడిపి నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు చలసాని జగన్మోహనరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ, అడుసుమిల్లి రామకృష్ణ, సరసయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్, ఆటో ఢీకొని మహిళ మృతి

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పోలవరం

ఆటో, ట్రాక్టర్ ఢీకొని ఒక మహిళ మృతి చెందింది. ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని వెంకటా పురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలవరం ఎస్ఐ ఎస్ఎస్. పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ప్రగడపల్లి గ్రామానికి చెందిన పెనుబాక లక్ష్మి వద్దకు తన సోదరి అయిన నిడదవోలుకు చెందిన మెరుపో రమణమ్మ ఇటీవల వచ్చింది. ఈ క్రమంలో రమణమ్మ కుమార్తెకు అనారోగ్యంగా ఉండడంతో ఆటోలో శనివారం తాళ్లపూడి ఆసుపత్రికి బయలుదేరారు. ఈ క్రమంలో వెంకటాపురం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, ఆటో ఢీకొన్నాయి. ఈ క్రమంలో ఇద్దరు మహిళలతో పాటు ఆటో డ్రైవర్ సీలం రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు. ముగ్గురిని కాకినాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో రమణమ్మ (45) మృతి చెందింది. ఆటోడ్రైవర్ రాంబాబు, పెనుబాక లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

బైక్‌పై నుంచి జారి పడి...

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గంపలగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం దొంతికుంటకాలనీకి చెందిన పచ్చినీల రాజా, జ్యోతి(35) దంపతులు ద్విచక్రవాహనంపై ఆదివారం బయ్యన్నగూడెంలో ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని గంపలగూడెం వద్దకు వచ్చేసరికి బైక్‌పై నుంచి జ్యోతి అకస్మాత్తుగా రహదారిపై పడటంతో తలకు బలమైన గాయమైంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుతాసుపత్రికి తరలించారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమడోలు

పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండుగొలను గ్రామానికి చెందిన సలాది కొండయ్య (47) గత నెల 11వ తేదీన మద్యానికి డబ్బుల కోసం తన భార్యపై ఒత్తిడి తెచ్చాడు. దీనికి భార్య నిరాకరించటంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం సాయంత్రం మృతి చెందారు.కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

16న గ్రామీణ భారత్ బంద్ జయప్రదానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరించిన ప్రజాసంఘాల నేతలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్త సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు నిర్వహిస్తున్న గ్రామీణ భారత్ బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు అధ్యక్షతన రైతు సంఘం, రైతు కూలీ సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్లబోయిన రాంబాబు, రైతు సంఘం జిల్లా నాయకులు జమ్మి శ్రీనివాస్, రైతు కూలీ సంఘం నాయకులు సద్గురుడు, మడకం రామన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుదే శ్రీను, జనా జగ్గారావు, ప్రజా సంఘాల నేతలు కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతికఘటిద్దామని, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దామన్నారు. బిజెపి అధికారంలోకొస్తే ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. నిరుద్యోగం గత 50 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరిందన్నారు. శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గిపోయాయన్నారు. నరేంద్ర మోడీ విధానాల వల్ల కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్ట స్థాయికి చేరాయన్నారు. 2023లో పాలకులు కార్పొరేట్లకు రూ.2.14 లక్షల కోట్లు బ్యాంకు రుణాలు మాఫీ చేశారన్నారు. 2019-2022 మధ్యకాలంలో ఒక శాతం ఉన్న బడా కార్పొరేట్ల వాస్తవ ఆదాయం 30 శాతం వృద్ధి చెందగా పేదల వాస్తవ ఆదాయం 11 శాతానికి పడిపోయిందన్నారు. ధరలు కనివిని ఎరుగని రీతిలో 30 నుంచి 56 శాతం వరకు పెరిగాయన్నారు. స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదవారి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామన్న హామీని మర్చిపోయారన్నారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందన్నారు. తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి తేవాలని ప్రయత్నిస్తుందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించేందుకు బిజెపి ప్రభుత్వం అంగీకరించటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం మండల రైస్‌మిల్ బజాజ్ జట్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.శివకుమార్, ఎఐటియుసి నాయకులు వి.నాని, పిల్ల తమ్మారావు, మర్రి త్రిమూర్తులు, జి.గోపీ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

జీలుగుమిల్లి : ఈ నెల 16వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. జీలుగుమిల్లి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించి నప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తెస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కార్పొరేట్ కంపెనీల రుణాలను రూ.లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతుల రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. మిచౌంగ్ తుపాను నష్టపరిహారం వెంటనే రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండలాధ్యక్షులు దాసరి జానకిరామిరెడ్డి, ఉపాధ్యక్షులు వీరసత్యం, మండల కార్యదర్శి శిరిబత్తుల సీతారామయ్య, ఎస్.సాయి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా పారిశ్రామిక సమ్మెను గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని ఎఐటియుసి ఏలూరు ఏరియా కమిటీ సమావేశం కార్మిక వర్గానికి రైతులకు ప్రజలకు పిలుపునిచ్చింది. స్థానిక స్ఫూర్తి భవనంలో ఎఐటియుసి ఏలూరు ఏరియా కమిటీ సమావేశం ఏరియా అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే మాట్లాడుతూ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు.

దెందులూరు (ఉంగ్రాజవరం) : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురాకుండా మోసగించిందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఈ నెల 16న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఉంగ్రాజువరంలో కరపత్రాలు పంపిణీ చేసి రైతులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయ అప్పులతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేరళ తరహాలో విమోచన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

ముసునూరు : ఈ నెల 16న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ముసునూరు మండల రైతు సంఘం నాయకులు పామర్తి శ్రీనివాసరావు, చిమట శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతు జిల్లా కమిటీల సభ్యులు, ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని 16 గ్రామాల రైతులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయం

భీమడోలు : రూ.లక్ష విరాళం అందిస్తున్న పూర్వ విద్యార్థి గుప్త

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు హైస్కూల్‌కి చెందిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాఠశాలలో 1973- 74, 74- 75 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివిన సుమారు వంద మంది విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. వీరిలో అధిక శాతం 50 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలవటంతో ప్రత్యేకత సంతరించుకుంది. వీరిలో పలువురు విశ్రాంత ఉద్యోగులు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారు, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో గడుపుతున్న వారు మరి కొందరు ఉన్నారు. వీరందరూ ఒకరినొకరు కలిసిన నేపథ్యంలో పరస్పరం వారి కుటుంబ సభ్యుల, ఇతర స్నేహితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రస్తుతం పాలేటి బ్రహ్మారావుతోపాటు పాఠశాల ప్రస్తుత ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహమ్మద్‌ను సత్కరించారు. పూర్వ విద్యార్థుల్లో ఒక రైన గుప్త పాఠశాల అభివృద్ధి కోసం రూ.లక్ష చెక్కును పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఇతరులు సైతం తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు హామీలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈతకోట సుబ్బారావు, డాక్టర్ వి.మురళీకృష్ణ, పిల్లి బ్రహ్మారావు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

మండవల్లి : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. 2003-2004 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థుల కలయికకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. 20 సంవత్సరాల తర్వాత విద్యార్థులు కలుసుకుని ఆనందపర్యంతమయ్యారు. ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. చనిపోయిన గురువులకు, విద్యార్థులకు నివాళులర్పించారు.

మండవల్లి : పూర్వ విద్యార్థులు

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

మద్దతు తెలిపి గెలిపించండి : మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య

ప్రజాశక్తి - చాట్రాయి

రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు తెలిపి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య అన్నారు. చాట్రాయిలో ఆదివారం నిర్వహించిన ప్రజా సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో, జిల్లాలో, మారుమూల ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. టిడిపి హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నీరు-చెట్టు పథకం ద్వారా తమ పార్టీ కార్యకర్తలకు డబ్బులు దండుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇచ్చిన హామీలు మర్చిపోయి సంక్షేమం అంటూ ప్రజలకు ఉచితంగా డబ్బులు ఇస్తూ వారి దగ్గర నుంచి రెట్టింపు సొమ్మును వివిధ రకాలుగా దోపిడీ చేస్తుందన్నారు. చాట్రాయి మండలంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, తాను అధికారంలో లేకపోయినా అనేక గ్రామాల్లో రోడ్లు వేయించానని తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని చెప్పుకునే అర్హత కూడా ప్రస్తుత ఎంఎల్ఎకు, మండల నాయకులకు లేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందనానరు. రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు తెలిపి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానన్నారు. జానపద నృత్యాలతో, అభ్యుదయ గీతాలతో చిన్నం రామకోటయ్యపై రచించిన ప్రత్యేక గీతాలు ప్రజలను ఆకర్షించాయి.

వ్యాయామ ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సుమలత(ఫైల్‌ఫొటో)

మండల పరిధిలోని ఎం.సూరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపా ధ్యాయినిగా పని చేస్తున్న జి.సుమలత(38) అనా రోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. నున్న గ్రామంలోని ఆమె స్వగృహంలో ఆమె మరణించింది. ఆమెకు భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుమలత అకాల మరణం పట్ల ఉపా ధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె మృతదేహా న్ని సందర్శించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

మరొకరి పరిస్థితి విషమం

ఉండి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యండగండిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తిలి గ్రామానికి చెందిన సింగంపల్లి రామ్మూర్తి(43), అదే గ్రామానికి చెందిన ములగాల జగదీష్ బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం భీమవరం వెళ్లారు. అక్కడ పని చూసుకుని అత్తిలి బయలుదేరారు. ఈ క్రమంలో ఎండగండి లాకుల వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు వారిని ఢీకొట్టడంతో సింగంపల్లి రామ్మూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన జగదీష్‌ను స్థానికులు భీమవరం ఆసుపత్రికి తరలించారు. జగదీష్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైసిపి హయాంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి

ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు

చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

పజాశక్తి - ఉంగుటూరు

వైసిపి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. మండలంలోని నారాయణపురంలో ఆదివారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. నారాయణపురం, తల్లాపురం, అప్పారావుపేట, సీతారాంపురం, రాచూరు, తదితర గ్రామాల డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఉంగుటూరు మండలంలో 1568 సంఘాలకు రూ.16,69,30,858 పైగా లబ్ధి చేకూరింది. అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరిందని అనిపిస్తే మళ్లీ జగన్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కోరిపల్లి జయలక్ష్మి, ఉంగుటూరు ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, ఎంపిటిసి సభ్యులు అరివెళ్లి మహాలక్ష్మి, బండారు నాగరాజు, నాయకులు బళ్ల త్రిమూర్తులు, సిపాని బాలు, ఉంగ్రాజవరపు గీతారాణి, సొసైటీ అధ్యక్షుడు బాబ్జీ పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలియో ఛైర్మన్‌గా వాసు

వాసును ఛైర్మన్‌గా ప్రకటించిన రోటరీ క్లబ్ నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు మద్దాల వాసు రోటరీ ఇంటర్నేషనల్ ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలియో ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రోటరీ జిల్లా 3020 పరిధిలోని ఆరు జిల్లాలకు సంబంధించిన ట్రైనింగ్ ప్రోగ్రాం ఆదివారం బొబ్బిలిలో నిర్వహించారు. ప్రపంచంలో పోలియో నిర్మూలన చేయడంలో రోటరీ అత్యంత సమర్థవంతంగా పని చేస్తుందని, బిల్ గేట్స్ ఫౌండేషన్ పోలియో నిర్మూలన కోసం చేసే సహాయాన్ని రోటరీ ద్వారానే చేస్తున్నారని వాసు తెలిపారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో నాలుగో విడత ఆసరా చెక్కులను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు 12వ తేదీ సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఎపిఒ గంధం లలితాశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 1,194 గ్రూపులకు సంబంధించిన 11,940 సభ్యులకు రూ.10.79 కోట్ల చెక్కులను పంపిణీ చేయనున్నారని ఆమె తెలిపారు. అధిక సంఖ్యలో మహిళా సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం పెట్రోల్ బంక్ దగ్గర సమీపంలో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు డ్వాక్రా గ్రూప్ సభ్యులకు ఆసరా సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎపిఎం బివి.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కింద 1258 గ్రుపులకు 12630 మంది సభ్యులకు రూ.11,81,61,293 మంజూరైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ పాల్గొని ఆసరా చెక్కులు అందించనున్నట్లు తెలిపారు.

మైసన్నగూడెం రోడ్డు నిర్మించండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని మైసన్నగూడెం రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన ఆదివారం మాట్లాడారు. రోడ్డు నిర్మాణం చేపట్టి సంవత్సరం కాలం కావస్తున్నా పూర్తి చేయడంలో సంబంధిత అధికారులు, ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఐదేళ్లు కావస్తున్నా ప్రజా సమస్యలు పట్టించుకోవడంలో తాత్సారం చేస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు ముఖద్వారమైన మైసన్నగూడెం రోడ్డు ప్రమాదకరంగా మారిందన్నారు. రోడ్డుపై రాళ్లతో, దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పి.చంటి, కె.సుబ్బారావు ఉన్నారు.

నేడు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని ఆ యూనియన్ జిల్లా సమితి అధ్యక్ష కార్యదర్శులు కె.విగ్నేష్, భజంత్రీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ సమ్మెలో అంగీకరించిన డిమాండ్లపై ప్రభుత్వం జిఒలు విడుదలలో ఆలస్యం చేయడాన్ని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్మికులు విధులకు హాజరవ్వాలని, 13వ తేదీ మంగళవారం మున్సిపల్ కార్యాలయాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు యూనియన్ బ్యానర్లతో ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

15న గ్రూప్ పరీక్షల సన్నద్ధంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఈ నెల 15న తేదీన గ్రూప్స్, డివైఇఒ పరీక్షల సన్నద్ధతపై ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా గుంటూరు, కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ కె.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు హాజరు కానున్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం అధ్యక్షత వహించగా గోపీమూర్తి మాట్లాడారు. పరీక్షల సన్నద్ధతకు అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గ్రూప్స్‌కు సిద్ధమయ్యే అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల ధనుష్ మాట్లాడుతూ గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ రామరాజు, కోశాధికారి పట్టాభి రామయ్య, భవాని ప్రసాద్, కుమార్ బాబ్జి, నాగ శిరోమణి, కృష్ణ కుమారి, రామకృష్ణరాజు పాల్గొన్నారు.

కనకరత్నమాలకు అపరాజిత షైనింగ్ స్టార్ అవార్డు

ఆచంట : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజెన్ నార్త్ మహిళా విభాగం అధ్యక్షురాలు భీమ లాపురం గ్రామానికి చెందిన కొత్త కనకరత్నమాల వెంక టేశ్వరరావు 2003 నుంచి 2024 వరకూ అనేక పదవుల్లో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభలో చేసిన విద్య, వైద్య సాంస్కృతిక సామాజిక యోగా వృత్తి శిక్షణ కార్యక్రమాలతో పాటు వివిధ సేవలకు గాను చెన్నయ్‌లో అపరాజిత షైనింగ్ స్టార్ వామ్ అవార్డును అందుకున్నట్లు ఆదివారం ఆమె విలేకరులకు తెలిపారు. ఈ అవార్డును చెన్నయ్ త్యాగరాయ నంద ఫంక్షన్ హాల్లో నేషనల్ ఒమెన్స్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో అపరాజిత షైనింగ్ స్టార్ వామ్ అవార్డును గ్లోబల్ కన్వీనర్ టిజి.వెంకటేష్, ప్రెసిడెంట్ రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, మాజీ ఎంఎల్ఎ అంబికా కృష్ణ, సినీ హీరో రాజకుమార్, గ్లోబ్ వామ్ కన్వీనర్ ఎంఎస్ఆర్ గుప్తా, రాజశేఖర్ జయశ్రీ చేతుల మీదుగా తీసుకున్నట్లు ఆమె తెలిపారు.